# అడ్డదారులు

అంతవరకు పరుగెత్తుకొచ్చిన వ్యాను ఒక్కసారి ఆగింది. ముందు అన్నిరకాల వాహనాలు బస్సులు, కార్లు, లారీలు వరుసగా ఆగివున్నాయి. బస్సులో నుండి కొందరు ప్రయాణీకులు దిగి ముందు ఏంజర్గుతుందా అని చూస్తూ నిలుచున్నారు.

" ఏమిటి? టీచర్ డ్రైవర్ని అడిగాడు.

"ఏమో సార్, బండ్లన్నీ ఆగి వున్నాయి." డ్రైవర్ చెప్పాడు.

" ఏదన్నా యాక్సిడెంటా"

ఈలోపు క్లీనర్ వ్యాన్ దిగి రోడ్డు ప్రక్కమ్మటి కొంత దూరము నడిచి విషయము తెలుసుకొని తిరిగొచ్చి" రాస్తారోకొ చేస్తుండు". వ్యాన్ దగ్గరికొచ్చి టైర్లను చూసి కొట్టి చెప్పాడు.

"ఎప్పుడు కదలాలి" అంటూ డ్రైవర్ దిగాడు.

ఆ తర్వాత టీచర్, పిల్లలు అందరు దిగారు. అందరు రాస్తారోకో వాళ్ల దగ్గరికి నడిచారు. రోడ్డు కడ్డంగా పిల్లలు పెద్దలు కూర్చొని నినాదాలు యిస్తూవున్నారు.

"ఫలానావాడి దౌర్జన్యము" అంటూ ఒకడు అరిచాడు.

" నశించాలి" అంటూ వందల గొంతులు కేకలుపెట్టాయి.

"అసమర్థ పాలకులు"

"గద్దె దిగాలి"

పెటపెటలాడే ఎండలో ఓ చెట్టు నీడను చూసుకొని ధర్నా చేసేవాల్లు కూర్చున్నారు. వాహనాలన్నీ ఆ ఎర్రటి ఎండలో ఆగివున్నాయి. బస్సుల్లోని వాల్లు 'దూప దూప' అంటు తమలో తామే గొణుగుకుంటూ వున్నారు. లారీ డ్రైవర్లు తోచిన భాషలో అటు ప్రభుత్వాన్ని యిటు ఆందోళనకారులను తిడుతువున్నారు.

" వీళ్లను లోపలేసి ఒకటే తోముడు తోమితే అర్థం అయితది" లారీడ్రైవర్ అక్కసుగా అన్నాడు.

"తోమడం దేనికి వారం రోజులు లోపల వుంచితేసరి" బస్సు డ్రైవర్ అన్నాడు.

" హు అంటే దర్నా, ఆ అంటే రస్తారోకో పనిపాటలేని" -- జీపు డ్రైవర్.

" ఏదన్నా వుంటే అసెంబ్లీలో మాట్లాడుకోవాలి, రోడ్డుమీదకాదు" బస్సులో నుండి దిగిన ఓ ప్రయాణికుడు అన్నాడు. బహుశా రాజకీయ నాయకుడు అయి వుంటాడు.

ఈ లోపు రస్తారోకోను నడిపిస్తున్న నాయకుడు అక్కడ వాళ్లను ఉద్దేశిస్తు ఉపన్యసిస్తు వున్నాడు.

" ప్రజాస్వామ్యం పతనమైంది. ఈ దేశంలో మనిషి బ్రతకడమే అధ్వాన్నం అయిపోయింది. ప్రజల ప్రాణ - మానాలకు రక్షణ లేకుండా పోయింది అనడానికి విజయవాడలో నిన్న జర్గిన యువనాయకుని దారుణమైన హత్యే సాక్ష్యం. దేశ నాయకునిగా ఎదుగుతున్న వాన్ని ఈ గుండాగిరి ప్రభుత్వం పొట్టన పెట్టుకుంది. ఆయన అందరి అభిమాన నాయకుడు అనడానికి నిదర్శనం నిన్న ఈ రోజు పట్టణాలలో జర్గిన నిరసనలే నిదర్శనము."

ఉపన్యాసం సాగుతూనే వుంది. బస్సులో జనం అసౌకర్యంగా ఊపిరి పీలుస్తూన్నారు. డ్రైవర్లు తిట్లను కురిపిస్తునే వున్నారు.

"రోజుకోబందు, పూటకోధర్నా ఇది ఏందేశమో" అంటు విసుక్కుంటున్నారు.

" ఇంకానయం రాళ్లు రువ్వలేదు"

"నిప్పు పెడితే చేసేదేముంది"

వీటి అన్నింటిని గమనిస్తు, టీచర్ విద్యార్థులు రస్తారోకో వద్ద నిలుచున్నారు.

అక్కడ చిన్న పెద్ద కలిసి పది మందిలేరు. కాని అన్నీ కలిసి వందదాక వాహనాలు ఆగిపోయాయి. పదిమంది వేయి మందికి కల్గిస్తున్న ఇబ్బంది యిది.

ఎవరో ఓ స్త్రీ పరుగెత్తుకొచ్చి "బాబులార బస్సులో ఓ ఆడకూతురు నొప్పులు పడుతువుంది. ఆ బస్సును వొదిలేస్తే ఆసుపత్రికి చేర్చొచ్చు" అంది.

ప్రదర్శకులు వినిపించుకున్నట్లు లేదు. టీచర్ విద్యార్థులు వెళ్లి నచ్చ చెప్పచూశారు.

ముందుగ ప్రకటించిన ప్రకారంగా ఒంటిగంటవరకు రస్తారోకో వుంటుంది అని జవాబిచ్చారు. చెప్పితె వినని వాల్లను వొదిలి అందరు తమ తమ వాహనాల దగ్గరికి వెళ్లి నిలుచున్నారు.

" పది మంది వందల మందిని నిలిపి వేయడం ఎక్కడి ప్రజాసామ్యమో" అనుకుంటూ టీచర్ వ్యాన్‌లో కూర్చున్నాడు. ఆడవాల్లు బస్సుదిగి చెట్ల చాటుకు వెళ్లొస్తున్నారు.

'దూప' అంటున్న పసిపిల్లలను తల్లులు కసురుకుంటున్నారు. ఆకలి అని అరిచే పిల్లలకు దిక్కులను చూపిస్తున్నారు. సరిగ్గా ఒంటిగంటకు రోడ్డు మీది వాళ్లు ప్రక్కకు తొలిగారు. వాహనాలు కదిలాయి. అంతవరకు అక్కడ వున్న విద్యార్థులు పరుగెత్తుకొచ్చి వ్యాన్ ఎక్కుతు " సార్ ఆ బస్సులో బాధపడుతున్న స్త్రీ చనిపోయిందట" అన్నాడు క్లీనర్. అవునన్నట్టు టీచర్ వైపు చూశారు అందరు.

" చ్చో, చ్చో ఆ పక్క బస్సునైనా పోనిస్తే వైద్యసహాయం అంది ఆమె బతికేది" అంటూ సానుభూతి చూపించారు.

" తల్లితోబాటు పిల్లగూడ బయటికి రాలేక చనిపోయిందట" అన్నాడు డ్రైవర్.

"అయ్యో" అంటూ బరువైన శ్వాస వదిలాడు టీచర్. అందరి ముఖాలలోను ఓ విషాదం చోటు చేసుకుంది.

" చెప్పేటోడు లేక చెడిపోయినట్టు యిట్టుంటే ఎట్టా సార్, ప్రతి చిన్న చిన్న దానికి దర్నా రాస్తారోకో అయితే ఈ దేశం ఎట్టా బాగుపడతది" అంటూ వ్యాన్ స్టార్ట్ చేశాడు డ్రైవర్. విద్యార్థులకు తాము చేసిన ధర్నాలు గుర్తొచ్చి సిగ్గుపడుతు యిలాంటి అనవసరపు వాటిల్లో పాల్గొనవద్దు, ప్రోత్సహించొద్దు అనుకున్నారు.

" ఒకప్పుడు దేశస్వాతంత్ర్యము పొందడానికి పరదేశీలయులపై ప్రయోగించిన పద్ధతులను ఇప్పుడు మనమీద మనమే చీటికి మాటికి వాడుకుంటు ప్రమాదాలను పెంచుకుంటున్నాం. ఏది ఎప్పుడు చెయ్యాలో ఎప్పుడు చేయకూడదో తెలుకొని మసలుకోక పోతే ఎట్టా ?"

ఏదేని అన్యాయం జర్గినపుడు, ప్రభుత్వము పట్టించుకోవల్సిన దాన్ని పట్టించుకోనపుడు నిరసన తెలియజేయవల్సిందే. అయితే ఆ పద్ధతి ఇతరులకు ఇబ్బంది కల్గించకూడదు. ఒకరి హక్కు సాధించడానికి మరి కొందరి హక్కులను హరించకూడదు" అని కాస్త కదిలి కూర్చుంటు " ఆ పోనీ" అన్నాడు టీచర్.

వ్యాను కదిలింది.